# వెన్నెల కిరణం

* వాచస్పతి *

'ప్రీణా :

రెండు సంవత్సరాల మన పరిచయమూ, స్నేహమూ ఈ రోజుతో అంతమైపోతాయి. ఈ రెండు సంవత్సరాలలో నన్ను గురించి నువ్వెంతో తెలుసుకోవాలని ప్రయత్నించావు. నీకై నువ్వు నన్నుగురించి ఏం తెలుసుకున్నావో నాకు తెలీదుగానీ, నాకై నేను ఏ విషయమూ నీకు చెప్పలేదు. శత్రువుల కంట పడకుండా ఎక్కడో సుదృఢమైన కోటలో దాచబడిన నిక్షిప్తంలా నా గతచరిత్రను నా హృదయంలో అతి జాగ్రత్తగా దాచి, నీ దాడినుండి ఇన్ని రోజులుగా రక్షించుకుంటూ వచ్చాను. కానీ, ఈరోజు ఆ నిక్షిప్త ధనాన్ని నీ ముందు పెట్టక తప్పదేమో అనిపిస్తోంది దాని ఫలితమే ఈ నా చిన్న ప్రయత్నం దీన్లో ఎంతవరకూ కృతార్థుడనౌతానో నాకే తెలీదు.

నా జీవితం ఒక విషాదగాథ. నేనొక వికృష్ట జాతకుణ్ని: నిర్భాగ్యుణ్ని: నిరంతరం మండే అగ్నిజ్వాలను. నా దగ్గరగా ఎవరు వచ్చినా, ప్రేమాదరణలను చిలకరించినా, వారిని నిర్దాక్షిణ్యంగా నా అగ్నిజ్వాలకు ఆహుతి చేస్తాను. అలా ఆహుతిగా తీసుకున్న వ్యక్తులు చాలామందే ఉన్నారు.

అలా ఆహుతైనవారిలో ప్రథములు— నా జీవన కారకులైన నాన్న. నేను అమ్మ గర్భంలోకి ప్రవేంచగనే నాన్నను ఈ లోకంనుండి పంపేశాను. తర్వాత ఈ భూమ్మీద పాదం మోపగానే నాన్నదగ్గరకే అమ్మనూ పంపాను. అందుకనే వాళ్ళను గురించి ఎక్కువగా ఏమీ చెప్పలేను. తర్వాత వ్యక్తి తాతయ్య –

ఈ విశాల ప్రపంచంలో మిగిలిందీ. 'నా' అని చెప్పుకోదగ్గ వ్యక్తీ – తాతయ్యా ఒక్కడే. తాతయ్యకు నేనూ, నాకు తాతయ్యా మిగిలాం. వృద్ధాప్యం రోజు రోజుకూ తన క్రూరమైన పిడికిలిలోకి తాతయ్య బలాన్నీ, ఉత్సాహాన్నీ లాక్కో సాగింది. అయినా తాతయ్య ఏ మాత్రం చలించలేదు. నిత్యదారిద్ర్యంతోనూ, ముంచు కొస్తున్న వృద్ధాప్యంతోనూ అలసటలేని పోరాటాన్నే సాగించాడు.


ఆ తెల్లటి ముఖంమీద నెరసిన గడ్డంతోపాటు నివాసం చేస్తున్న ముడుతలు విషాద గీతికలాంటి ఆయన జీవితానికి గుర్తులో, లేక వృద్ధాప్యం తనకు మారుగా నియమించిన ప్రతినిధివర్గమో నా కర్థమయ్యేది కాదు. ఏమైతే ఏం? చాలా రోజులవరకూ తన చిరునవ్వుల తెరలలో వాటిని దాచి, అసలు విషయం

తెలియనీయకుండా నన్ను మభ్యపెట్టాడు.

తాతయ్య రెక్కల కష్టమే నా జీవనాధారం ఎన్ని కష్టాలనైనా సరే చిరునవ్వుతో స్వీకరించేవాడు. ఆయన జీవిత లక్ష్యం ఒక్కటే. ఊరూ పేరూలేని తన మనవణ్ని ఒక గొప్పవ్యక్తిగా తయారు చేయాలని. ఆ లక్ష్యసాధనలో తాతయ్య ఎంతవరకూ ముందుకు పోగలిగాడో నాకు తెలీదు. బహుశా తాతయ్య ఈరోజు ఉండుంటే, తనఆశాలతలుఎంతగాచిగిర్చి పుష్పించాయో చెప్పిఉండేవాడేమో!

ఆ లాలనా, ఆ ఆదరణా, ఆ ప్రేమా ఏ తల్లినుండీగూడా ఏ బిడ్డా పొందలేదేమో? ఒడిలో కూర్చోబెట్టుకుని, చందమామను చూపిస్తూ గోరుముద్దలు, తినిపించే తాతయ్య రూపాన్ని జీవితంలో ఎలా మరచిపోగలను? నా ముఖంలోని ఒక సంతోషరేఖ తాతయ్య ముఖంలో వెయ్యి సంతోష రేఖలను వెలిగించేది. నా వదనంలోని ఒక సంతృప్తివీచిక తాతయ్య వదనంలో వేయి సంతృప్తి వీచికలను కలిగించేది

తన చూపుల్లో చల్లని వెన్నెలను నింపి నా మీద చిలకరించే ఆ ప్రేమ



మూర్తి లేడు. ఆ భావనతో హృదయం, జీవితం, ప్రపంచం సర్వం శూన్యంగా కనిపిస్తున్నాయి.


నేను గర్భదరిద్రుణ్ణని ముందే చెప్పాను. కానీ, నా దారిద్ర్యంతో పోరాడింది నేను కాను. తాత్యయ్య! చిత్రంగా లేదూ! శత్రువుతో పోరాడను తన సైనికబలాన్ని ముందు పంపి వెనక ఉండి విజయాన్ని సాధించే పిరికి సేనానిలా, నేను నా దారిద్ర్య సమరంలోకి తాతయ్యను తోశాను, ఉహు...తాతయ్యే నా కోసం ముందుకు వెళ్ళేడు. నేను మట్టుకు గుడ్లప్పగించి చూస్తూ ఊరుకున్నాను. కానీ, తాతయ్య ఆ సమరంలో జీవితాన్ని ధారబోసినా, ఆవిజయఫలాన్ని మటుకు నే నీరోజు కొద్దిగానో గొప్పగానో అనుభవిస్తున్నానని చెప్పక తప్పదు.

ఐదోతరగతి చదువుతో మా పల్లెలో చదువు పూర్తయింది. తర్వాత పట్టణంలో ఉంటున్న జమీందారులాంటి రెడ్డిగారి దగ్గరకు నన్ను తీసికెళ్ళాడు తాతయ్య. ఇద్దరిమధ్యాఉన్న పరిచయాన్ని పురస్కరించుకుని నా చదువువిషయంలో రెడ్డిగారి సహాయాన్ని యాచించాడు. ఖాకోసం ప్రాణాలనేగాదు, ప్రాణంకన్నా విలువైన అభిమానాన్నిగూడా వొదులుకుని యాచించాడు. రెడ్డిగారు చాలా ఉదారస్వభావులు. నా తెలివితేటల విషయం విని నన్ను తప్పకుండా అభివృద్ధిలోకితీసుకొస్తానని తాతయ్యకుమాట ఇచ్చారు. ఆమాటనిలబెట్టుకున్నారుకూడ.

నేను రెడ్డిగారింటికి వచ్చిన కొన్ని రోజులకే – తన బాధ్యత తీరిపోయిందనేనేమో శాశ్వతంగా నానుండి దూరమైపోయాడు తాతయ్య. అప్పుడు తెలిసింది నాకు! తాతయ్య టి. బి.తో బాధపడ్తున్నాడని! అగ్నితాను ఉజ్జ్వలంగా మండాలంటే ఆజ్యాన్ని ఎలా ఆహుతిగా తీసుకుంటుందో, అలాగే ఈ అగ్నిజ్వాల ప్రకాశవంతంగా మండేందుకు, నామీద ప్రేమాదరణలను చిలకరించి నాదగ్గకొచ్చినవారిని నాలోకి తీసుకుని నేను మటుకు మండుతున్నాను. తర్వాత నా అగ్నిజ్వాలలో పడి మలమల మాడిపోయిన మరొకవ్యక్తి మాలతి.

మాలతి రెడ్డిగారి పెద్దమ్మాయి శరీరమెంత కోమలమో, మన సంతకన్నా సుకుమారం; మితభాషిణి. విధాత అందమంతా ఆమెకే ఇచ్చాడేమో అనిపిస్తుంది. ఆమెను చూస్తే నిరంతరం కన్నులనుండి జాలువారే స్నేహవాత్సల్యాల జల్లూ, సదా వదనంలో నాట్యంచేసే చిరునవ్వూ–ఎంత సేపయినా ఆమెను చూడాలనిపించేటట్లు చేస్తాయి. ఆమె నడుస్తుంటే ఏ సుందర లతో, ఏ విద్యుల్లతో కదులుతున్నట్లనిపించేది. ఆమె సౌందర్యానికి మరొకరూపం

రెడ్డిగారింట్లో నేను పది సంవత్సరాలున్నాను. ఈ పదిసంవత్సరాలలోనూ ఏరోజూ మాలతి నాతో ఎక్కువ చను



వుగా మాట్లాడలేదు. అయినా నా ప్రతి చర్యనూ ఆమె ఏ మూలనుండో గమనిస్తున్నట్లే అనిపించేది నాకు. నా అవసరాలను ఇంట్లో అందరికన్నా ఎక్కువ శ్రద్ధగా మాలతే గమనించేదని ఈ రోజు నేను గట్టిగా చెప్పగలను.

మాలతి పట్ల నా భావాలు ఫలానా అని స్పష్టంగా చెప్పలేను. ఆప్యాయతా, ఆదరణా లోపించిన ఎడారిలాంటి నా జీవితంలో ఏ రోజన్నా ఆప్యాయతనే ఒక వర్షపు చినుకు పడిందంటే అది సహృదయిని ఐన మాలతి వల్లనే. రెడ్డిగారి భార్య లలితమ్మ అప్పుడప్పుడూ పరోక్షంగా హేళనగా తిట్టేది. దాంతో

నా హృదయం తూట్లుపడిపోయేది. నా నికృష్ట, నిర్భాగ్య జీవితం కళ్ళ ముందు కదిలేది. ఆ క్షణం నన్ను భూదేవి తనలోకి తీసుకుంటే ఎంత బాగుండు ననిపించేది. అవమానంతో, సిగ్గుతో అధోలోకాలకు క్రుంగిపోయిన నా తలను భారంగా ఎత్తి, బరువుగా కళ్ళెత్తి చూసేసరికి, జాలిగా నా కళ్ళల్లోకి చూస్తున్న మాలతే కనిపించేది. ఆ చూపుల్లో ఎంత ఓదార్పు! ఒక్క విషయం వీణా! – అనుభవంతో చెప్తున్నాను నికృష్ట, నిర్భర దారిద్ర్యంతో ఐనా సరే, తలిదండ్రులతో జీవించడం స్వర్గమే. పరపంచలు పట్టుకుని సర్వసుఖాలూ అనుభవించినా అది నరకమే. ఆ పదిసంవత్సరాలలోనూ – ప్రతిక్షణమూ ఆ ఇంట్లో నాకు గల స్థానాన్ని గుర్తుచేసుకుంటూనే గడిపాను.

బి ఏ క్లాసుతో పాసయ్యాను. కాని, ఎవరున్నారు సంతోషించేందుకు? రెడ్డిగారి ముఖంలోమటుకు ఆరోజు సంతృప్తి రేఖలను చూడగలిగాను. మాలతి మృదువైన కంఠంతో అభినందనలు అందజేసింది. రెడ్డిగారే ఉద్యోగం చూపించి, ఈ జీవన సమరంలో విజయాన్ని సాధించి తాతయ్య ఆశలకూ, కలలకూ రూపకల్పన చేయమని ఆశీర్వదించారు.

ఆ మర్నాడు ఉదయం నేను ప్రయాణమై వెళ్ళిపోవాలి. ఆ సాయంత్రం స్నేహితులనంతా కలుసుకుని కాస్త ఆలస్యంగా ఇల్లు చేరాను. వరండాలో అడుగు పెట్టేసరికి హాల్లోనుండి మాలతి గద్గద కంఠం, రెడ్డిగారి కఠోరవాక్కులూ, లలితమ్మ సణుగుడూ అస్పష్టంగా వినిపించసాగాయి. ఠక్కున ఆగిపోయాను.

మరుక్షణం రెడ్డిగారి గొంతు పెద్దగా వినిపించసాగింది—

"నువ్వింత అవివేకమైన పని చేస్తావని నే ననుకోలేదు మాలతీ! మన అంతస్తెక్కడ? వాని అంతరం ఎక్కడ? ఎవరికన్నా చెప్పినా నవ్విపోగలరు! మన కనుసన్నల్లో మెలగి, మన దయాదాక్షిణ్యాలవల్ల పైకివచ్చినవాణ్ని చేసుకునే దుర్గతి నీ కేం పట్టింది? ఒక యాచకుడూ, అనామకుడూ, దరిద్రుడూ, కులహీనుడూ నా అల్లుడు కావటమా? నీకు నిజంగా మతిపోయింది మాలతీ!"

నేను ఆశ్చర్యానికి మరొక రూపంలా కొన్ని క్షణాలలాగే నిల్చుండిపోయాను. అసలు నాపట్ల మాలతికి అలాంటి భావం ఉందని ఎప్పుడూ ఊహించేందు కెక్కడా వీల్లేదు. నిజం చెప్పాలంటే నాక్కూడా తెలీదు. మాటల్లోగానీ, చేతల్లోగానీ ఒక రోజయినా మాలతి తన హృదయాంతరంలో భద్రంగా దాచిన భావాన్ని నాకు వ్యక్తం చెయ్యలేదు. ఆ సమయంలో నాలో కలిగిన భావాలకు రూపకల్పన చేసి, నీ ముందిరోజు పెట్టగలశక్తి నాలో లేదు. ఏదో ఉద్వేగం నన్ను పట్టి ఊపడంతో కొన్ని క్షణాలపాటు నిలువెల్లా వణికి

పోయాను, జరుగుతున్న దంతా ఒక కల లాగే ఉందిగానీ, వాస్తవంలా లేదు. కళ్ళు నులుపుకొని కిటికీలోనుండి చూశాను. రెడ్డిగారు విసురుగా కుర్చీలో నుండి లేచి – "మాలతీ! పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకు ఇదేం సినిమాకాదు. ఆ దరిద్రుడు ఈ ఇంటికి అల్లుడు కావడం జన్మలో జరగదు. నువ్వు ప్రాణాలు తీసుకున్నా సహిస్తానుగాని, ఆ దరిద్రుణ్ణి చేసుకోవడం మటుకు సహించను." కఠినంగా అని విసవిసలాడుతూ వరండాలోకి వచ్చారు. ఆ ఉగ్ర స్వరూపం చూసి నేను మరింత భయపడిపోయాను. నా గురించి కాదుగానీ, మాలతిని గురించే; లోపల్నుండి వినవస్తున్న మెల్లని రోదన నా గుండెలను పిండిచేసింది. కళ్ళెత్తి రెడ్డిగారి ముఖంలోకి చూడలేక, అపరాధం చేసినవాడిలా తలొంచుక నిల్చున్నాను. ఇందులో నా తప్పు ఏమీ లేదని ఆయనకూ తెలిసినట్లుంది.

"ఉదయాన్నే తప్పకుండా వెళ్ళిపో. నా ఉప్పు తిని నా పరువుప్రతిష్ఠలకు భంగం కలిగేటట్లు చేయకు;" గంభీరంగా అని అక్కడనుండి వెళ్ళిపోయారు.

ఆ రాత్రంతా మాలతినిగురించే ఆలోచనలు. అసలు నిద్రే పట్టలేదు. ఏవేవో విద్రోహ భావాలతో కొంతసేపు ఉద్రిక్తుణ్ణయ్యాను. ఇంతకుముందు ఎన్నడూలేని భావాలు మాలతిపట్ల కలిగాయి. కానీ, క్రమక్రమంగా నా విద్రోహభావాలనుండి తప్పించుకుని ఆరాత్రి ఎలాగో గడపగలిగాను. మాలతి పట్ల అనురాగాన్ని పెంపొందించుకొనేందుకు, ఆమె నా కేరోజూ ప్రోత్సాహాన్ని గానీ, అవకాశాన్నిగానీ ఇవ్వలేదు. తన హృదయంలోని అనురాగలతయొక్క మనోహర సుమసౌరభాలను ఏమాత్రమైనా ఇతరులు ఆఘ్రాణించడం జరిగినా, తనకన్నా నాకే ఎక్కువ ప్రమాదమని మాలతి అభిప్రాయం కావచ్చు. నిజంగా అలా జరిగివుంటే, రెడ్డిగారు నన్నా మరుక్షణమే ఇంటినుండి తరిమివేసేవారు. అలా తిరిగివుంటే ఈరోజు నే నెక్కడో అజ్ఞాతవాసం చేస్తూ, అసలు నీదృష్టిలో పడేవాడినికూడా కాదేమో?

తెల తెలవారుతూండగా చిన్న కునుకులోనుండి లేచేసరికి, ఇంట్లో ఏదో హడావుడిగా ఉంది. ఏడ్పులు కూడా వినిపిస్తున్నాయి. ఒక్క ఉదుటున లేచి లోపలిగదిలోకి వెళ్ళాను. డాక్టరు విచార వదనంతో వెళ్తున్నాడు. లలితమ్మ గుండెలు బాదుకుని ఏడుస్తోంది. రెడ్డిగారు కుప్పగా కూలిపోయారు. మాలతి మంచంమీద నిద్రపోతున్నట్లే పడుకుని ఉంది. మరణంలో గూడా ఆమె సౌందర్యాన్నే విరజిమ్ముతోంది. నా హృదయం పగిలి ముక్కలై పోయింది. దగ్గరగా వెళ్ళి చివరిసారిగా ఆ ప్రేమ మూర్తిని దర్శించుకొన్నాను.

రెడ్డిగారూ, లలితమ్మా తమ చూపుల

నుండి నిప్పులవర్షాన్ని నా మీద కురిపించారు. అగ్ని అగ్నిని కాలుస్తుందా? నేను మరింత ప్రజ్వలంగా మండసాగాను! మాలతినిగూడా ఆహుతిగా తీసుకున్న ఈ అగ్నిశిఖ ఇంకా ఎన్ని ప్రాణాలను బలిగా తీసుకునేందుకు ఎదురుచూస్తూందో?

ఎవరికోసం బ్రతకాలో తెలీకున్నా, బ్రతకాలిగనుక ఆరోజే ఆ ఇంట్లోనుండి వచ్చేశాను ఈ విశాల ప్రపంచంలోకి.

ఇప్పటికన్నా అర్థమైందా వీణా? అమ్మా, నాన్నా, తాతయ్యా, మాలతీ ఈ నష్టజాతకుడిమీద ప్రేమకొద్దీ, అగ్నిజ్వాల అని తెలుసుకోలేక అందులోపడి ఆహుతయిపోయారని?

నీ నుండి దూరంగా ఉండేందుకు నేనెందుకు ప్రయత్నించేదీ, ప్రస్తుతం దూరంగా వెళ్ళిపోతున్నదీ ఎందుకో నీకీపాటికి తెలిసే ఉంటుంది. అంతా నీ మేలుకోసమే. నన్ను వెతికేందుకు ప్రయత్నించకు. నన్ను మరచిపోవడం నీకు మంగళకరం.

సదా నీ శుభాన్ని కోరే
మాధవ్'

వీణ ఉత్తరం చదవడం పూర్తిచేసి తలెత్తి చూసింది. కళ్ళల్లోనుండి నీళ్ళు ధారగా ప్రవహిస్తున్నాయి. కన్నీటిని తుడుచుకుని కిటికీలోనుండి చూసింది. తెలతెలవారుతోంది. పక్షులు తమ ప్రత్యూషగీతాలను పాడుతున్నాయి.

ఒక క్షణంపాటు తీవ్రంగా ఆలోచించింది. చివాల్న లేచి, ఇంటికి తాళం పెట్టి, స్టేషన్ వేపు వెళుతున్న రిక్షాను ఆపి అందులో ఎక్కింది. రిక్షా స్టేషన్ చేరేసరికి ఐదు నిముషాలు పట్టింది. ఆత్రంగా రిక్షా దిగి దూరాన్నుండే ప్లాట్‌ఫామ్ అంతా ఒక్కసారి గాలించింది. దూరంగా చెట్టుక్రింద దీనవదనంతో, ఒంటరిగా కూర్చునున్న మాధవ్ ఆమె కంట పడనేపడ్డాడు. దగ్గరకు వెళ్ళి కంపితస్వరంతో "మాధవ్" అంది.

ఏదో ఆలోచనలతో సతమతమైపోతున్న మాధవ్ తలెత్తి వీణను చూసి ఆశ్చర్యపోయాడు. తను వెళ్ళిపోయాక గానీ, వీణ ఉత్తరం చదువుకోదనుకున్న తన ఊహాగానం కేవలం ఊహాగానమే అయింది.

వీణ ముఖంలోకి చూడలేక చూపులు తిప్పుకుంటూ — "అయితే ఉత్తరం చదివావా?" అన్నాడు మెల్లగా.

"చదవకుండా స్టేషను కెలావస్తాను?" బరువుగా నవ్వుతూ అంది.

"ఇంత తొందరగా నీవు లేచి ఉత్తరం చూస్తావనుకోలేదు." పశ్చాత్తాప కంఠంతో అన్నాడు.

"రోజూ త్వరగా లేచేదాన్నికాదు. కాని, ఈ రోజు దేవుడే లేపాడేమో అనిపిస్తోంది. ఎందుకో ఉన్నట్టుండి మెలుకువ వచ్చింది. దాంతో సన్నగా తలపోటు ప్రారంభమైంది.

కాఫీ చేసుక తాగుదామని లేచి లైటు




వేశాను. కిటికి దగ్గరగా ఉత్తరం పడి ఉంది. ఉత్తరం పోస్టు చేసే ఉంటే నిన్నసలు జన్మలో చూడగలిగేదాన్ని కాదేమో?" తలొంచుకుని, కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్న నీటిని దాచేందుకు వ్యర్థ ప్రయత్నం చేస్తూ అంది.

"చివరిసారిగా నిన్ను చూడాలనిపించింది. కిటికీలోనుండి లేవెన్నెల కాంతిలో నిన్ను చూసి తృప్తి పడ్డాను. తిరిగి రావడంలో, కిటికీ కమ్ములు పట్టుకు

మన్న చేతిలోని కవరు జారి నీ గదిలో పడిపోయింది. నువ్వింత త్వరగా లేచి ఉత్తరం చదువుతావని ఊహామాత్రంగానైనా తెలిసి ఉంటే, స్టేషనుకు రాకుండా మరెక్కడికన్నా వెళ్ళి ఉండేవాడిని." ఒక్క సందేహం—ఉత్తరం చదివినాకూడా, నన్ను వెతుక్కుంటూ రావాలనిపించిందా వీణా?'' పాలిపోయిన ముఖంతో అంత కన్నా పాలిపోయిన నవ్వుతో అడిగాడు.

"రావాలని అనిపించబట్టే వచ్చాను. నీ అపోహలతో విన్నిలాగే వదలివేస్తే చివరకు నువ్వే సర్వనాశనం అయిపోతావేమో అన్న భయం నన్ను పరిగెత్తు కొచ్చేటట్లు చేసింది. ఎలాగయితే ఏం నువ్వు కనిపించావు. ఇక పోదాం పద;" కళ్ళెత్తి అతని కళ్ళల్లోకి చూస్తూ అంది. కంఠం సన్నగా చలించింది.

అంతవరకూ బలవంతంగా ఆపి ఉన్న కన్నీరు చెక్కిళ్ళమీదుగా జారింది. దాంతో చివాల్న తల తిప్పుకుంది.

మాధవ్ ముఖంలో బాధావీచికలు అల లలలుగా లేచాయి. తడి కన్నులతో వీణవేపుచూస్తూ—"వొద్దు వీణా! నా మాట విను. నీకు నమస్కారం చేస్తాను. నానుండి దూరంగా వెళ్ళు. ఈ నష్టజాతకునిమీద అభిమానం నీ కేవిధంగానూ మంగళదాయకము కాదు,"వ్యథితకంఠంతో అన్నాడు.

వీణ కళ్ళు తుడుచుకుని తల తిప్పి మాధవ్ ముఖంలోకి చూస్తూ—

"ఇదంతా నీ అపోహ, భ్రమ, అసత్యవాదన. అంతేకాదు మాధవ్, ఇది నీ పరాఠీతత్వానికి నిదర్శనం. ఆత్మీయుల మరణం దుఃఖాన్ని కలిగిస్తుంది. కానీ, దానికంతా నీవే కారణ మనుకుని, లేని పోని అపోహలను సృష్టించుకుని, జీవితాన్నుండే పారిపోవాలని చూస్తున్నావు. నేను పుట్టాను, అమ్మానాన్నా చనిపోయారు. కానీ, నేను నీలా పరిగెత్తి పారిపోవడంలేదు. ఇక మాలతి విషయం. పిరికితనం, తండ్రి కఠినత్వం, తన నిస్సహాయపరిస్థితి ఆమెను ఆత్మహత్యకు ప్రోత్సహించాయి. నీ అపోహలను ఈరోజుకన్నా తొలగించుకో. నువ్వింక అగ్నిజ్వాలవు కాదు; చీకటి లాంటి నా జీవితంలోకి వెన్నెల తీసు కొచ్చిన వెన్నెలకిరణానివి. మళ్ళీ నాజీవితాన్ని చీకటి చేసి, పారిపోకు. ఏ కష్టాన్నయినా నీతో పంచుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఇక వెళ్దాంలే" అంటూ మాధవ్ చేతిని తన చేతిలోకి తీసుకుంది. మాధవ్ మెరుస్తున్న కళ్ళతో వీణ ముఖంలోకి చూస్తూ—"నిజమే; నేను భయస్థుణ్ణి, పిరికివాణ్ణి వీణా. నాలో నాటుకుపోయిన ఈ అపోహ బీజం ఎవ్వరూ తొలగించలేదు. చీకటితెరలతో నిండిన నా హృదయానికి వెన్నెల నిచ్చిన వెన్నెలకిరణానివి నువ్వే. నే నేమీకాదు. నీ సహచర్యంలోనన్నా నా అపోహలనూ, పిరికితనాన్నీ దూరం చేసుకొనేందుకు ప్రయత్నిస్తాను. పద వెళ్దాం" అన్నాడు.